# మానవుని విశాలహృదయునిగా తీర్చిదిద్దటమే విద్యకు పరిపూర్ణత

ఆధునిక విద్యపెరిగెను అంతులేక
ఆత్మవిద్యయు క్షీణించె అవధిలేక
సత్యధర్మంబులన్నియు సమసిపోయె
సంకుచిత హృదయులైరి యీ చదువువలన.

అతిగ భాషించు శూరత్వమధికమయ్యె
కార్యశూరత క్షీణమై కరగిపోయె
బ్రతుకు లాడంబరాలతో భారమాయె
నేటి విద్యార్థి బ్రతుకు యీపాటిదాయె.

**విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!**

ఇది ఆధునిక యుగము. అనంతమైన సాంకేతిక విజ్ఞానము వెల్లివిరిసిన కాలము. కానీ యీ విజ్ఞానము బహిరమైన నాగరికతను మాత్రమే మనకు బోధిస్తూ ఉంటున్నాది. ఈనాటి విద్యార్థులకు కావలసినది ఆత్మవిశాలము. ఆత్మపరిపాకము. హృదయ నిర్మలము. ఇదియే అంతరమైన నాగరికతను, సంస్కృతిని మనకు అందిస్తుంది. మేధాశక్తితోపాటు హృదయ నిర్మలత్వమును చేకూర్చుకోవాలి. మానవుని విశాల హృదయులుగా తీర్చిదిద్దటమే విద్యయొక్క పరిపూర్ణత. ఈ విద్య శీలతత్వమును పోషించుకోవటమే కాకుండా మెదడుకు తగిన క్రమశిక్షణను అందించేదిగా ఉండాలి. అప్పుడే జీవితములో క్రమశిక్షణ మనకు ఏర్పడుతుంది. వినయ, వివేకములు లేని విద్య నిరుపయోగమైనది. ఆధునిక విద్యలన్నియు వినయ విధేయతలకు అతిదూరమై ఉంటున్నవి. విద్య నిమిత్తమై మనము గుణమును కోల్పోరాదు. గుణ సంపత్తిని యినుమడింపచేసుకోటమే విద్యయొక్క ప్రధాన లక్ష్యం. మూర్ఖులైన నిరక్షరకుక్షులకంటె విద్యావంతులైనవారివల్లనే లోకము అనేక విధములుగా చెడిపోతూ ఉంటున్నాది. కారణము,

srisathyasaivachanamrutam

యీ విద్యయందు తగినంత గుణసంపత్తి లేకపోవటమే! గుణమే మానవుని ప్రధానమైన జీవితము.

విద్యార్థులు భారతీయులుగా జీవించటానికి తగిన కృషి చెయ్యాలి. ఈనాడు విదేశ విజ్ఞాన సంపర్కముచేత భారతీయ చైతన్యమును మనము కోల్పోతున్నాము. కేవలము కృత్రిమమైన జీవితముగా రూపొందింపచేసుకుంటున్నాము. ఈనాటి భౌతికవిద్యలు, వైజ్ఞానిక విద్యలు మానవుని పరాధీనము గావిస్తున్నవి. బానిసగా తయారు చేస్తున్నవి. మాష్టరు కావలసిన విద్యార్థి యీనాడు సేవకుడిగా తయారౌతున్నాడు. స్వార్థరాహిత్యము, వినయము, నిరాడంబరము విద్యయొక్క ప్రధానమైన గుర్తులుగా నిరూపించాలి. భారతీయ చైతన్యమనగా నీతి, నిజాయితీ, సహజ సౌశీల్యములతో కూడిన తత్త్వము. దీనికి నాలుగు విధములైన మార్గములను అనుసరిస్తూ, యీ విద్యాసౌధమునకు నాలుగు స్తంభములుగా నిలబడినవిగా మనము గుర్తించాలి. మొదటిది ఆత్మనిగ్రహము. రెండవది ఆత్మవిశ్వాసము. మూడవది స్వయంకృషి. నాల్గవది స్వార్థరాహిత్యము. Self control, self confidence, self support, self sacrifice. ఈ నాలుగే విద్యకు మూల స్తంభములు.

**ఈనాడు విజ్ఞానము పెరిగింది గాని వివేకము శూన్యమైంది**

ఈనాటి విద్యార్థులు self నే మరచిపోతున్నారు; యింక కంట్రోలు యెక్కడ, support ఎక్కడ, sacrifice ఎక్కడ? తనతత్త్వమునే తాను విస్మరించి జగత్తును మాత్రము విశ్వసించి, మానవత్వమును కోల్పోయి, దానవత్వముగానో లేక పశుత్వముగానో మార్చరాదు. మానవుని పరిపూర్ణ మానవునిగా తీర్చిదిద్దాలి. ఈనాడు మరొక మార్గములో దేశమును సంరక్షించటానికి తగిన శక్తి సామర్థ్యములు మనకు లేకపోవచ్చును. సత్యమే సరైన శక్తి. సత్యమును మనము కాపాడుకొందుమా జగత్తునే కాపాడినవారమవుతాము. ఈనాటి మానవుడు లౌకిక విషయములను అనేకముగా తెలుసుకున్నాడు. అనేక విధములైన సిద్ధాంతములను గుర్తించుకుంటూ వచ్చాడు. వైజ్ఞానికముగా అనేక పరిశోధనలు సాగిస్తున్నాడు. కానీ మానవునిగా తాను నిలబెట్టుకొన్న గుణము యేమిటో ఒక్కటైనా చెప్పగలరా? తాను సాధించిన మానవత్వము ఏమిటి? తనయందు మానవతాగుణములు యేరీతిగా ఉంటున్నవి? ఎన్నింటిని

sri sathyasaivachanamrutam

పోషించుకున్నారు? ఎన్నింటిని ఆదర్శముగా నిరూపిస్తూ ఉన్నారు? ఈ ప్రశ్నలకు యే విద్యావంతుడు సరైన జవాబు యివ్వటము లేదు. ఈనాటి వైజ్ఞానిక శాస్త్రమందు వివేకరహితులై, వినయ రహితులై, మానవత్వమును విస్మరించి, కేవలము యేదో జగత్తును పోషించే లక్ష్యముతో అనేక విధములైన అభివృద్ధులను సలుపుతూ ఉన్నారు. నిజముగా వివేకమే ఉంటుండిన తాను సృష్టించిన యంత్రములన్ని కూడను, bombs అన్నికూడను జగత్తును యేవిధముగా నిర్మూలనము గావించుచున్నవో అనే విషయమును తాను గుర్తించుకోకుండా ఉండలేదు. ప్రపంచమునే భస్మము గావించే బాంబు నిర్మాణము గావించి దానిని ఉపయోగించటంచేత ఆ నిర్మాణము గావించిన వ్యక్తి మాత్రము నిల్చగలడా యీ జగత్తులో? నిర్మాణము గావించిన దేశము మాత్రము క్షేమముగా నిలువగలదా? ఇంతమాత్రము విచారణ లేకుండా, వివేకము లేకుండా యీ యంత్రములు యేరీతిగా సృష్టిస్తూ వస్తున్నారు? విజ్ఞానము పెరిగింది గాని వివేకము తరిగింది. కనుక వివేకమనేది నిత్యానిత్య విషయపరిశీలన. అదిలేని సమయము లోపల మానవుడు ఎన్ని సృష్టించి ఏమి ప్రయోజనము?

## విద్యార్థులు సరైన స్నేహమును అభివృద్ధి పరచుకోవాలి

విద్యవలన మానవుడు పరిపూర్ణమైన మానవుడుగా తయారు కావాలి. విద్యార్థులకు చేతినిండుకు పని, హృదయము నిండుకు పవిత్రమైన భావములు నింపాలి. కాని, యీనాటి విద్య విషయపరిపాకమును తలకు చేర్చుకుంటూ వస్తున్నది. మానవత్వ నిర్మాణతను గాని, శీల నిర్మాణతను గాని యీనాటి విద్య యేమాత్రము ప్రోత్సహించటము లేదు. వినయములేని విద్య, శీలములేని జీవితము, విచక్షణ లేని పాండిత్యము, క్రమశిక్షణ లేని సమాజము, కృతజ్ఞత లేని సోదరుడు, చేసిన మేలు మరచే స్నేహితుడు, మాధుర్యము లేని సంగీతము, అర్హతలేని అధికారము, ప్రేక్షకులను సంపూర్తిగా తృప్తిచేయలేని ఉపన్యాసములు లోకములో యేమాత్రము రాణించవు. ప్రజామన్ననలను అందుకొనలేదు. వీటన్నింటికి మూలకారణమేమిటి? విద్యార్థికి సంఘదోషము చాలా పటుత్వముగా ఉంటున్నది. విద్యార్థులు సరైన స్నేహమును అభివృద్ధి పరచుకోవాలి. ఈ విధమైన స్నేహమును అభివృద్ధి పరచుకొన్నప్పుడే విద్యార్థియొక్క వివేక, విజ్ఞానములు కూడను అభివృద్ధి గాంచటానికి ఒక అవకాశము ఉంటుంటాది. 'త్యజ దుర్జన

srisathyasaivachanamrutam

సంసర్గమ్' Runaway from evil company. ఈ విధముగా చెడ్డవారి సహవాసమును తక్షణమే మనము వదలిపెట్టాలి. చెడ్డవారివలననే ఉత్తముడైన విద్యార్థికూడను అధముడుగా మారిపోతున్నాడు. మానవుడుగా ఉండినవాడుకూడను దానవుడుగా తయారౌతున్నాడు. ఈ దుస్సంగమనేది మానవుని అనేక విధములైన దుర్గుణములలో ప్రవేశింపచేస్తుంది. కేవలము వ్యక్తుల యొక్క సహవాసము మాత్రమే కాదు. దుష్టభావములు కూడను మనలో ప్రవేశించకుండా చూడాలి. మనలో చెడ్డ తలంపులు చేరినప్పుడే చెడ్డక్రియలలో మనము ప్రవేశిస్తున్నాము. కనుకనే భావములను కూడను మనలో ప్రవేశించకుండా చూచుకోటం యీ విద్యయొక్క ప్రధానమైన లక్ష్యము. పాము విషపురుగు అని మనము భావిస్తాము. కాదు, కాదు. దుష్టుడే పాముకంటె మహాదుర్మార్గుడు. పాము ఎప్పుడో ఒక పర్యాయము మాత్రమే, తమ జోలికి పోయినప్పుడు మాత్రమే కరచటానికి ప్రయత్నిస్తుంది. దుష్టునకు కాలనియమములే లేవు. దేశకాల పరిస్థితులకుకూడను అతీతుడై ఉంటాడు. ఎట్టి కారణమునుకూడను తాను చూడడు. పరులను బాధించటము, పరులను హింసించటమే దుష్టునియొక్క ఆనందము. కనుక, అట్టివారి సహవాసమునుంచి మనము దూరముగా ఉంటుండాలి.

**క్రూరమృగమును దెచ్చి కూర్మితో పెంచిన**
**ఆకలయ్యేనేని అదమిపట్టు**
**దుష్టగుణములుండు దుర్జను స్నేహము**
**క్రూరమృగముకంటె ఘోరమగును.**

**కోపమున్నవాని కోరి చేరగవచ్చు**
**పాముప్రక్కనైన పండవచ్చు**
**మత్సరంబుగల మనుజుని స్నేహంబు**
**చేరెనేని వాడు చెడును యిలను.**

కనుక, మనము సాధ్యమైనంతవరకు 'త్యజ దుర్జన సంసర్గమ్. భజ సాధు సమాగమమ్'. సద్గురువులయొక్క సంపర్కమును మనము సంపాయించుకోవాలి.

**మంచివారి పొందు మహిలోన దొరుకదు**

sri sathyasai vachanamrutam

**దుష్టులెందరైన దొరుకుచుంద్రు**
**కలికిరాళ్లు భువిని కలవు యెందైనను**
**వెలను బోలు వజ్రమొకటి కలదా!**

సజ్జనునియొక్క సహవాసమును మనము అమితముగా ఆశించాలి. అట్టివారివలన మనము యెంతైనా ఉన్నతస్థితి అందుకోటానికి అవకాశము ఉంటుంది. నిరుత్సాహముతో కృంగిన స్నేహితుని ఉత్సాహపరుస్తాడు. అనేక విధముల శక్తి సామర్థ్యముల నిచ్చి అభివృద్ధి గావిస్తాడు. సజ్జనుడనగా ఎవరు? సత్యము, ప్రేమ, సహనము, సానుభూతి యిత్యాది ఉత్తమ గుణములతో కూడిన శీలవంతుడే సజ్జనుడు. ఎంతటి ఉపకారము పొందినప్పటికిని అట్టివారికీ అపకారము తలంచేవాడు మహాదుష్టుడు. చేసిన మేలును మరచేవాడు మహాదుష్టుడు. పరులమంచిని ఆశించలేనివాడు మహా దుష్టుడు. ఉన్నత స్థాయిలో ఉత్తమ మార్కులు పొందినవానిని చూచి అసూయపడేవాడు దుష్టుడు. కనుకనే అన్యాయ, అక్రమ, అనాచారములతో తులతూగుతుండేవాడు మహాదుష్టుడు. న్యాయ, సత్య, సహన, సౌశీల్యములతో కూడినవాడు సజ్జనుడు. నిరంతరము పరులను దూషించేవాడు పాపి. మనయందున్న దోషములను మనము నిర్మూలము గావించుకొని పవిత్రమైన గుణములను పోషించుకోటానికి ప్రయత్నము చేసేవాడు సజ్జనుడు.

**ఉపయోగము లేని తెలివితేటలు ఎన్ని ఉండి ఏమి ప్రయోజనము?**

ఎవ్వరిని మనము నిందించరాదు. ఎవ్వరిని మనము బాధించరాదు. కాని, యీనాటి యువకులందు కన్నతల్లితండ్రులనే హింసించే కుమారులు ఉంటున్నారు. ఇది సరైన మార్గము కాదు. తినేది వారి తిండి. కట్టే బట్ట వారిబట్ట. నివసించే కొంప వారిది. ఏతావాతా నీ blood, నీ food, నీ head, parents gift. అట్టి తల్లి దండ్రులనే విస్మరించే దుర్మార్గుడు యింకెవరిని విశ్వసించగలడు? తల్లిదండ్రుల ఆజ్ఞలను తిరస్కరించేవారు పుత్రుడేగాదు, పుత్రికాకాదు. ఇది కేవలము విద్యయొక్క వికారమైన చేష్ట. కనుక వికారమును దూరము చేసుకొని ఆకారముగా బ్రతకటానికి మనము ప్రయత్నించాలి. కనుక 'స్మర సజ్జన సంసర్గమ్, కురు పుణ్య మహోరాత్రమ్'. పవిత్రమైన కార్యములలో మనము ప్రవేశించాలి. సహజ సానుభూతులతో

srisathyasaivachanamrutam

యితరులకు తోడ్పడే కార్యములందు, రోగులను సేవించుటయందు, దీనులను దిక్కులేనివారిని ఆదరించుటయందు మనము తగిన కృషి సల్పాలి. అదే 'కురు పుణ్య మహోరాత్రమ్'. రాత్రిపగలు అనే విచారణ చేయకుండా ఎప్పుడు అవసరమైతే అప్పుడు నీ సహాయము అందించటానికి నీవు సంసిద్ధుడవై ఉండాలి. ఈ విధమైన పరోపకారములందు నీకాయమును అంకితముగావించినప్పుడే 'పరోపకారార్థమిదం శరీరమ్'. ఈశరీరము సార్థకమవుతుంది. తెలివితేటలను యీనాడు గొప్పగా పెంచుకుంటున్నారు. అవే గొప్ప గుణములుగా భావిస్తున్నారు. కాదు, కాదు. నిజముగా హృదయ సంబంధము నుంచి ఉబికిన, ఊరిన నిజమైన సత్యభావములే మనయొక్క సత్యగుణములు. ఆ గుణము యీనాటి విద్యావంతులయందు అతిస్వల్పముగా ఉంటున్నది. అలాంటి గుణహీనుడైనవాడు యెంత గొప్ప విద్యలు చదివినప్పటికిని యీ ప్రపంచములో రాణించలేడు.

**గుణము కొంచెముండి గొప్పచదువుండిన**
**ఫలమదేమి వాని విలువదేమి**
**పంట పండని భూమి పదిఎకరములేల**
**కొంచెమైన చాలు మంచిభూమి.**

ఉపయోగము లేని తెలివితేటలు ఎన్ని ఉండి యేమి ప్రయోజనము? ఎన్ని విద్యలు ఉండి ప్రయోజనము ఏమిటి? ఆదర్శప్రాయమును అందించే సద్గుణము ఒక్కటుంటే కూడ చాలు.

**ఈనాటి విద్య మానవుని ఇంద్రియములకు దాసుని గావించుచున్నది**

విద్యార్థులారా! ఈనాడు మనము విద్యకు తగిన వినయ విధేయతలు ప్రకటించటానికి ప్రయత్నించాలి. కానీ, యీనాటి విద్య మానవుని కేవలము యింద్రియములకు దాసుని గావించుచున్నది. కాదు కాదు. ఇంద్రియములను నిగ్రహపరచుకునే విద్యార్థిగా మనము పోషించుకోవాలి. విద్యకు యీ నాలుగే మూలస్థంభములు Self control, self satisfaction, self sacrifice, self support. ఈ నాల్గింటిని మనము అభివృద్ధిపరచుకొన్నప్పుడు అదే నిజమైన విద్యను రాణింపచేసేదిగా తయారౌతుంది. విద్యార్థులారా! ఈనాడు మానవునియొక్క మనస్సు మహా చంచలమైనది. విద్యార్థులు తప్పనిసరిగా షట్ సంపత్తిని అందుకోవటానికి

sri sathyasai vachanamrutam

ప్రయత్నించాలి. శమ, దమ, ఉపరతి, తితీక్ష, శ్రద్ధ, సమాధానములు. మొదటిది, శమము. శమమనగా ఏమిటి? బహిరింద్రియములను మొట్టమొదట అరికట్టుకొనుటకై ప్రయత్నించాలి. మన కన్నులు బాహ్య దృష్టినే ఆశిస్తున్నాయికాని అంతర్దృష్టిని ఆశించటము లేదు. చెవులు బయటి విషయములనే శ్రవణము చేస్తున్నాయిగాని అంతరంగ శబ్దమును శ్రవణము చేయడానికి యేమాత్రము ప్రయత్నించడంలేదు. మనపాదములు బయటప్రపంచమునందే సంచరించుచున్నవిగాని అంతరంగములో యేమాత్రము ప్రయాణము చేయటంలేదు. ఈవిధముగా బహిర్ముఖమైన ఇంద్రియములు బహిర్‌తత్త్వమును మాత్రము ఆచరిస్తూ, ఆనందిస్తూ, అనుభవిస్తూ ఉంటున్నాయి. ఇట్టి బహిర్ముఖములో ప్రయాణము చేసే ఇంద్రియములను అరికట్టుకోవటమే శమము. అయితే దమమనగాఏమి? ఇది అంతరింద్రియములకు సంబంధించినది. మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము. యీనాలుగు కూడను మానవునికి కనుపించేవి కాదు. కనుకనే వీటిని అంతరింద్రియములని చెప్పుతూ వచ్చారు. అయితే, యీ అంతరింద్రియముల ప్రోత్సాహ, ఉత్సాహములచేతనే బహిరింద్రియములు ప్రకటించుచున్నాయి. బహిర్ముఖమైన యింద్రియములతో మనకు యేమాత్రము ప్రమాదము లేదు. ఇవి అంతర్ముఖమైన యింద్రియములచేత ప్రోత్సహించబడుతున్నాయి.

**మనసు తలచినట్లుగా అనుసరించరాదు, బుద్ధితో విచారణ చేయాలి**

ఇది ఎట్లనగా కారుకు నాలుగు టైర్సు ఉంటాయి. ముందు లైట్లు ఉంటాయి. పెట్రోలు టాంకు ఉంటుంది. ఇవన్నీ బయటనే ఉంటున్నాయి. అయితే స్టీరింగు మాత్రము లోపల ఉంటున్నాది. ఈ టైర్సు బయట రోడ్డుపైన నడచేవి అయినప్పటికిని లోపల స్టీరింగు తిప్పినప్పుడే ఆ టైర్సు తిరుగుతాయి గాని బయట టైర్లు పట్టుకొని తిప్పుతే తిరగవు. మనమైండ్ స్టీరింగు. ఈ మైండ్ అనే అంతరింద్రియము తిరిగినప్పుడే బహిర్ముఖమైన కాళ్ళు చేతులు అన్నీ తిరుగుతూ ఉంటాయి. లైట్లే మన కన్నులు. ఈ హారన్సు మన చెవులు. Front టైర్సు మన hands. Bak టైర్సు మన legs. యివన్నీ అంతరింద్రియములపైనే ఆధారపడి ఉన్నాయి. కనుక బహిర్ముఖమైన నోటిని, కంటిని, చెవులను మనము అరికట్టుకొనుటవలన ప్రయోజనము లేదు. నిద్రావస్థలో

సహజముగనే వీటిని అరికడుతున్నాము. మొట్టమొదట మనస్సును కంట్రోలు చేయటానికి ప్రయత్నించాలి. మనస్సనే స్టీరింగు సరైన స్థితిలో ఉంటే యీ యింద్రియములు యే మాత్రము పెడమార్గము పట్టవు. ఒక్కొక్క తూరి స్టీరింగు చెడిపోయిందంటే యీ యింద్రియములు యిష్టము వచ్చినట్లు పడిపోతాయి. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' కనుక, మొట్టమొదట మనస్తత్వమును చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి.

మనసు తలచినట్టుగా మనము అనుసరించరాదు. తదుపరి బుద్ధితో మనము విచారణ సల్పాలి. నీ మనస్సు చెప్పిన విషయము Is it right or wrong, Is it good or bad అని బుద్ధితో విచారణ చేయాలి. ఈనాటి విద్యార్థులు బుద్ధివరకు ప్రయాణము చేసే అవకాశము లేదు వారికి, పాపం. మనసు తలంచిన తక్షణమే అందులో మూర్ఖముగా ప్రవేశిస్తూ ఉంటారు. "నేను విద్యార్థిని, నేను విద్యావంతుడిని, నేను చేయతగిన పనియా, నేను చేయతగని పనియా? ఇది నా యొక్క స్థానమునకు గౌరవమా? అగౌరవమా? ఈ సమాజములో ఉండిన పౌరులకంతా నేను ఆదర్శవంతమైనవాడిగా నిరూపించాలి. అలాంటి వాడను నేను ఒక విధమైన చెడ్డ మార్గమున ప్రవేశించరాదు. సరైన ఆదర్శప్రాయుడుగా జీవించాలి" అని విచారణ చేయాలి. గుణములు మనము అభివృద్ధి పరచుకోవాలి.

**నీ మంచిచెడ్డలు నీవే నిర్ణయించుకోవాలి**

ఇంక ఉపరతి. అనగా మనస్సుయొక్క తత్వాన్ని బహిర్ముఖమైన యింద్రియములలో ప్రయాణము చేయకుండా అంతర్ముఖమైన భావాన్ని కొంతవరకు చింతించాలి. నాచిత్తము పరిశుద్ధముగా వుందా లేదా, నా భావములు సరైనవా కాదా అని తనలో తాను కొంతవరకు విచారణ చేయాలి. తనకు తాను self satisfaction అయిన తరువాతనే self sacrifice కు మనము ప్రయత్నము చేయాలి. కాని తనకు self satisfaction కావటం లేదు. అలాంటి సమయములో పైల మనము ఏరీతిగా బహిర్ముఖములో మన జీవితాన్ని గడపటానికి వీలవుతుంది? ఉపరతి అనగా మొట్టమొదట తనలో తాను కొంతవరకు సంతృప్తి పడటానికి ప్రయత్నించాలి. దీనినే conscience అన్నారు. మన conscience కు తృప్తి లేనప్పుడు మన జీవితము యేమాత్రము తృప్తినొందదు. నిజముగా నీ master అదే! నేను అనేక పర్యాయములు

sri sathyasai vachanamrutam

చెప్తూ ఉంటాను. నాలుగు F లు. మొట్టమొదట follow the master. నీ conscience ను నీవు follow చేయాలి. కానీ నీ conscience కి విరుద్ధముగా నీవు జరుపుతూ నేను ఏదో చక్కగా జరుపుతున్నానని ప్రపంచమును మోసగిస్తున్నావు. నీవు తలచటము ఒక్కటి, చెప్పటం మరొకటి. చెప్పటం ఒకటి, చేయటం మరొకటి. ఇది మానవత్వమునకు విరుద్ధమైనది. The proper study of mankind is man. Thoughts, words, deeds యీ మూడింటి యొక్క ఏకత్వము కావాలి. నీ హృదయములో ఉన్నదానిని నీవు సరైన పవిత్రమైన మార్గములో తయారు చేసుకోవాలి. అదే follow the master. నీ conscience ను నీవు సరైన రీతిలో అనుసరించినప్పుడు face the devil. ఈ దుష్టమైన, అపవిత్రమైన అనిత్యమైన, అశుభ్రమైన దీనిని మనము ఎదుర్కోటానికి సంసిద్ధముగా ఉండవచ్చు. ఇది ఎంతవరకు మనము చేయాలి? మనము confidence develop చేసుకొనేంతవరకు ఉండాలి. Follow the master. Face the devil. Fight to the end. కడావరకు మనము దీనితో పోరాటము సలపాలి. అప్పుడే self sacrifice అదే అయిపోతుంది. అదే finish the game. కనుక మొట్టమొదట మన హృదయము సరైన రీతిలో ఉన్నదా లేదా అని విచారణ సలపటమే ఉపరతి. నీ మంచి చెడ్డలు ఎవరో చెప్పటం కాదు. నీ మంచి చెడ్డలు నీవే నిర్ణయించుకోవాలి. ఏవిధముగా నిర్ణయము చేసుకోవాలి? నీకు తృప్తి కరముగా నిర్ణయము చేసుకోవాలి. కాని యీనాడు అట్టి పవిత్రమైన దీనిలో ఎవరు ప్రవేశించటం లేదు.

**జీవితంలో బేలన్సు తప్పిపోతే జీవితం ప్రమాదానికి గురవుతుంది**

ఇంక తితీక్ష. రెండింటియొక్క సమత్వమే తితీక్ష అన్నారు. ఎవరైనా నిన్ను నిందించనీ లేక వర్ణించనీ రెండింటిని సమభావముతో తీసుకోవాలి. ఇది కేవలము శబ్ద తరంగములుగా మనము విశ్వసించాలి. ఒకరు దూషించటమువలన మనమంచి ఒరిగిపోదు. ఒకరు పొగడటంవల్ల మనమంచి పెరిగిపోదు. ఒక తూరి మంచి మార్కులు తెప్పించుకోవచ్చు. మరొకసారి ఫెయిలైపోయానని నిరాశతో నిస్పృహతో కృంగరాదు. ఇవి యేదో నా ఉత్సాహ, ప్రోత్సాహములను అభివృద్ధి పరచటానికి వచ్చిన ఫలితములని భావించాలి. కనుకనే The pleasure is an interval between two pains అన్నారు. రెండు బాధల మధ్యలోనే సుఖము

sri sathyasai vahini amrutam

ఉందని మనము విశ్వసించాలి. ఫేలైపోయానే అని నిరాశతో కృంగరాదు. 'దేనికి నేను ఫేలయ్యాను? నేను సరిగా చదవలేదు. అని దానిని నీవు చక్కగా విచారించాలి. నాప్రయత్న దోషమేగాని మరొకటి కారణంకాదు. కాని యికముందు నేను నా ప్రయత్నాన్ని చక్కగా సాధిస్తాను', అనే దీక్షను పట్టాలి. అలాంటి దీనిలో determination చక్కని పట్టుదలను పట్టాలి. ఈ విధముగా ఉండినప్పుడే మనము అన్నింటియందు సమత్వమును, ఆనందమును అందుకోగలము. చల్లటిగాలి వీస్తుండాది. ఈ చల్లటి గాలిని మనము యెక్కువ కాలము అనుభవించలేము. ఒక్కొక్కతూరి చాలా వేడిగాల్పులు వీస్తూ ఉంటాయి. వాటిని కూడా మనము సహించుకోలేము. కుండపోతవంటి వర్షము కురుస్తూ ఉంటుంది. కానీ, దానిని కూడా ఎక్కువకాలము మనము భరించుకోలేము. రక్తం గడ్డకట్టే చలిగాలి వేస్తుండాది. దానిని కూడను మనము సహించుకోలేము. "ఏమి పాడు ఎండలు? ఏమిటి ఈపాడు చలి? ఏమిటి యీ పాడు వాన? ఏమాత్రము నాకు విశ్రాంతి నివ్వటంలేదు", అని మనము దూషిస్తూ ఉంటాము. ఇవి ప్రకృతియొక్క సహజ లక్షణాలు. ప్రకృతియొక్క నిర్ణీతమైన కాలాన్ని, నిర్ణీతమైన సమయాన్ని దూషించే అధికారము మనకు ఎక్కడుంది? మంచి చెడ్డలను సమముగా చూచుకొనే భావాన్ని మనము పోషించుకోవాలి. ఈ equal mind, మానవుని యొక్క సమత్వమనేది, విద్యార్థిదశయందే మనము అభివృద్ధిపరచుకోవాలి. అట్లు లేకుండా మన జీవితములో balance తప్పిపోయిందంటే మన జీవితమే ప్రమాదములో మునిగిపోతుంది. మన తెలివితేటలు చాలా పెరిగిపోతున్నాయి. కానీ యీ knowledge ని పోషించుకోటానికి తగిన కృషి చేయకుండా మనము పాడు చేసుకోటానికి పెడమార్గము పట్టిస్తున్నాము. నీవు knowledge ని skill చేయి. Balance చక్కగా ఉంటుంది. కానీ నీవు knowledge ని kill చేస్తున్నావు. అనగా ఏమిటి, misuse చేస్తున్నావు. దుర్మార్గములో ప్రవేశపెడుతున్నావు. కనుకనే యిక్కడ balance తప్పిపోతున్నాది. మన నడక కూడను balance పైనే ఆధారపడి ఉంటున్నాది. సైకిలు తొక్కటం balance పైనే ఆధారపడి ఉంటున్నాది. Life ఒక Balance. ఈ balance తప్పిపోతే life ప్రమాదములో పడిపోతుంది. కనుకనే knowledge, skill, balance, Insight యీ నాల్గింటి యొక్క సమత్వమును మనము పోషించుకోవాలి. ఈ విధమైన దీంట్లో మనము కొంతవరకు ఉపరతి అనేదానినుండి తితీక్షలో ప్రవేశించాలి.

**ఈనాడు క్రమశిక్షణ లోపించడానికి కారణం సమయపాలన లోపించడమే!**

sri sathyasai vahini

శ్రద్ధ ఐదవది. ఈ శ్రద్ధయే మన జీవితము. శ్రద్ధలేకపోతే యే చిన్న కార్యములోకూడను మనము విజయము సాధించలేము. శ్రద్ధ కలిగినవానికి యింత నిప్పు యిస్తే దానిని చక్కగా పోషించుకొని పెద్దనిప్పుగా తయారు చేసుకోవచ్చు. శ్రద్ధ లేనివానికి చాటెడు నిప్పు యిచ్చినా అది ఆరగొట్టుకుంటాడు. కనుకనే 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్' అన్నారు. మనము జ్ఞానము సంపాయించుకోవాలంటే శ్రద్ధ ఉండాలి. ఆ శ్రద్ధే తపస్సు. ఆ శ్రద్ధనే ఆనందము. ఆ శ్రద్ధనే జ్ఞానము. ఆ శ్రద్ధయే విద్య. అయితే నిజమైన శ్రద్ధ ఉంటుండాలి. శ్రద్ధలేకపోతే మనము ఏమి చేయగలము? బద్ధులమై పోతాము. ఈ బద్ధులనుంచి ఎద్దులుగా మారతాము. ఎద్దులనుంచి కౄరత్వములో మునిగిపోతాము. కౄరత్వమునుండి పశుత్వమునకు దిగజారిపోతాము. కనుక శ్రద్ధను మనము అభివృద్ధి పరచుకోవాలి. ఈ శ్రద్ధవలన సమయపాలన, కాలనిర్ణయము అలవడుతాయి. మొట్టమొదట సమయపాలన శ్రద్ధతో పోషించుకోవాలి. కాలేజీ తొమ్మిది గంటలకు అంటే correct గా ఆ సమయానికి రావాలి. ఈనాడు కొంతమంది పెద్దలంతాకూడను సాయంకాలము నాలుగు గంటలకు మీటింగు అంటారు. రాత్రి తొమ్మిది గంటలకు వస్తారు. ఈ విధంగా కాలమునే వీరు adjust చేసుకోలేకపోతే, సమయమును సరిగా పాలనచేయలేకపోతే, ప్రపంచమును యేరీతిగా పాలన చేయగలరు? ఎలాంటి పరిస్థితులు అడ్డు తగిలినాగాని సమయానికి అక్కడకు పోయి చేరాలి. ఈ సమయపాలన మానవునికి ప్రధానమైనది. విద్యార్థులకు గాని, ఉపాధ్యాయులకు గాని, పాలకులకు గాని, ఇంకా ఏ వ్యక్తికైనా కూడను, యీ సమయపాలన అత్యవసరమైనది. ఎన్ని గంటలకు మనము రావాలి. ఎన్ని గంటలకు కాలేజీకి పోవాలి. ఎన్ని గంటలకు స్నానం చేయాలి. ఎన్ని గంటలకు break fast తీసుకోవాలి. ఇవన్నీ చక్కగా సరైన రీతిలో చేసుకోవాలి. ఈ విధమైన రీతిగా మనము సమయ పాలనము చేసినప్పుడే హృదయముకూడను perfect గా ఉండటానికి వీలవుతుంది. ఏ ఒక్క చిన్నదానియందు తారతమ్యము ఉండకూడదు. అప్పుడే క్రమశిక్షణ అలవడుతుంది. కాని, యీనాడు క్రమశిక్షణ కోల్పోటానికి కారణం యేమంటే సమయపాలన మనలో లోపించింది.

**'కృషి కూటికోసం, విద్య విజ్ఞానము కోసం'**

విద్యార్థులారా! యీనాడు విద్యావిధానమనేది పెడమార్గము పడుతూ వస్తుండాది. ఈ



sri sathyasai vahini.org / vachanamrutam

విద్యలో చైతన్యముగాని, నైపుణ్యముగాని యేమాత్రము కనిపించటము లేదు. ఏదో బుక్కులు కంఠస్థము గావించుకోటము, కంఠస్థము గావించుకున్న విషయాలలో మార్కులు తెప్పించుకోటం, డిగ్రీలు పొందటము యింతమాత్రమే జరుగుతున్నది. 'కృషి కూటికోసం, విద్య విజ్ఞానము కోసం.' కాని దురదృష్టవశాత్తూ యీనాడు education కూటికోసము ఉన్నట్లుగా మనము భావిస్తున్నాము. మన విద్య జీవితముకోసము, అన్నము కోసము కాదు. ఈనాటి విద్యార్థులందరుకూడను తమయొక్క మానసిక తత్త్వాన్ని చాలా పెడమార్గము పట్టించుకుంటున్నారు. ఒక విద్యార్థి mathematics లో చాలా clever గా ఉంటాడు. దానిని చక్కగా పోషించటానికి అధిపతులు కొంతవరకు, టీచర్స్ కొంతవరకు ప్రోత్సహించాలి. విద్యార్థికూడా దానిని అనుసరించుతూ పోవాలి. ఆ విధముగా ఒక్కొక్క సబ్జెక్టులోపల ఒక్కొక్కనికి అభిరుచి ఏవిధముగా ఉన్నదో ఆ అభిరుచిని పురస్కరించుకొని ఆ సబ్జెక్టును డవలప్ చేసుకుంటూ పోవాలి. ఈనాడు యీ commerce, యీ sicence, యీ bio science వీటిద్వారా నా భవిష్యత్తులో ఏ ఉద్యోగము చిక్కుతుంది, ఎంత సంపాదిస్తాను అని మొట్టమొదటనే సంపాదనకు, ఉద్యోగమునకు ప్లాన్లు వేస్తారు. దీనిని బట్టి మనము చూస్తే జీవనోపాధికి చదువుతున్నారేగాని జీవితముయొక్క పరమావధికి వారు చదువుకోటంలేదు. మంచి జీతము సంపాదించాలి. ఏమిటి యీ జీతములు, జీతములు? Watchman కూడా జీతము తీసుకుంటాడు. బస్సు conductor జీతము తీసుకుంటాడు. ఏమిటి యీ జీతము? జీవితమనే జీతము మనము సంపాదించాలి. విద్యానందమును పొందటానికి ప్రయత్నించాలిగాని విషయానందముకోసము గాదు.

**ఆత్మనిగ్రహము, ఆత్మానందము, ఆత్మజ్ఞానము యీ మూడింటి సమ్మేళనమే స్వేచ్ఛ**

విద్య అనేది శరీరమునకు, మనస్సుకు, ఆత్మకు సంబంధించినదిగా ఉండాలి. ఏవిధముగా ఆత్మతత్త్వమనేది అంతర్ముఖమునందు, బహిర్ముఖమునందు సంచరిస్తూ ఉన్నదో అదేవిధముగనే విద్యకూడను సర్వవ్యాపిగా సంచరించాలి. అదే constant integrated awarness. దానిని మనము పోషించాలి. ఇది నిజమైన విద్య. ఏదో ప్రపంచ విషయములంతా తలకు చేర్చుకొని తలకు భారముగా చేసుకొని ఏ blood pressure లేక paralysis వచ్చి పడిపోటం కాదు. ఇవన్నికూడను బహిర్గతమైన నాగరికతను మాత్రమే పోషింపచేస్తున్నవి.

కాని, అంతరమైన నాగరికతనుకూడను మనము అభివృద్ధిపరచుకోవాలి. అదే ప్రధానమైనది. పునాదులు భద్రముగా లేకపోతే ఎంతభవనములు కట్టినా ఏమి ప్రయోజనము? కనుక, లోపల ఉండిన మానసికతత్త్వము, ఆ యొక్క పవిత్రతను మనము బలపరచుకోటానికి ప్రయత్నించాలి. అప్పుడు బహిర్ముఖమైన ఆనందమును అనుభవించవచ్చును. ఈబహిర్ముఖమైనది మనకు అవసరమైనప్పటికి దీనికి ఆధారమైన అంతర్ముఖమును మనము పోషించుకోవాలి. అదియే హృదయ పరిపాకము, హృదయ విశాలము, హృదయ నిర్మలము. అదే నిజమైన మన స్వేచ్ఛ. స్వేచ్ఛ అనగా యిష్టము వచ్చినట్లంతా బజార్లు చుట్టటంకాదు. నీకు తోచిన పనులన్నీ చేయటం కాదు, స్వేచ్ఛ. ఆత్మనిగ్రహము, ఆత్మానందము, ఆత్మజ్ఞానము యీ మూడింటి సమ్మిళితమైనదే స్వేచ్ఛ. కానీ ఈనాడు యీ స్వేచ్ఛకు అనేక విధములైన అర్థములు చెప్పుకుంటూ మానవుడు కేవలము కుక్కలకంటె హీనముగా ప్రవర్తిస్తున్నాడు. కాదు కాదు, మన విద్యార్థులు ఒక్కొక్క దేశమునకు, ఒక్కొక్క గృహమునకు, ఒక్కొక్క బజారునకు ఒక street lamp మాదిరి ఉండాలి. ఆదర్శమును అందించే విద్యార్థులుగా తయారు కావాలి.

### క్రమశిక్షణ లేకపోతే జీవితమే వ్యర్థమైపోతుంది

విద్యార్థులారా! ఈనాడు నూతన విద్యార్థులు ప్రవేశించారు. మన విద్యాసంస్థ యొక్క నిబంధనలు, నియమములు కొంతవరకు వారు గుర్తించుకొని వర్తించటానికి ప్రయత్నించాలి. కేవలము అన్నివిద్యాసంస్థలవలె కాకుండా, యీ విద్యా సంస్థయందు ప్రత్యేకమైన లౌకిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక సంబంధమైన మార్గములన్నియు అందించేటువంటిది. ఈ వాతావరణమునకు తగిన రీతిగా మీరు ప్రవర్తించటానికి పూనుకోవాలి. యీ నూతన ప్రదేశములో ప్రవేశించినవారు, దీనిని సమన్వయము గావించుకొని, సంరక్షించుకొని ఉత్తేజమైన నూతన భావములలో మీరు ప్రవేశించాలి. అందరియందు సోదర భావము పెంచుకోవాలి. ఇది మనయొక్క గృహముగా విశ్వసించాలి. హాస్టలు ఉంటుందాది. హాస్టలు నిజముగా మనయొక్క వసతి గృహము. ఇది నా యిల్లు. నాయింటిలో యేవిధమైన పెడమార్గములు పట్టకూడదు. నాయింటి పరిస్థితి యేమాత్రము చెడపకూడదు. నీ విద్య పూర్తి అయ్యేంతవరకేకాకుండా నీ జీవితమనేది యీ విద్యాలయముగా భావించుకోవాలి. డిగ్రీ నీకు అంత్యము కావచ్చుగాని



srisathyasaivachanamrutam

జీవితము అంత్యమయ్యేంతవరకు యీ శిక్షణ ఉంటుండాలి. కనుక discipline చాలా అవసరము. ఆ discipline లేకపోతే మనయొక్క జీవితమే వ్యర్థమైపోతుంది.

విద్యార్థులారా! యిక్కడ యీ యొక్క పరిస్థితిని మీరు మొట్టమొదట అర్థము చేసుకోటానికి ప్రయత్నించండి. ఏదో ప్రవేశించటానికి పూర్వము అనేక ఉత్సాహములతో యిక్కడకు రావచ్చును. కాని యిక్కడ ఉన్న క్రమశిక్షణలతో మధ్యమధ్య కొంతవరకును మనస్సు చలించవచ్చును. పూర్వము నీవు తొమ్మిది గంటలకు, పదిగంటలకు నిద్రనుండి లేస్తూ ఉండవచ్చును. కానీ మన హాస్టల్‌లో నాలుగు గంటలకు లేవాలి. చల్లని నీళ్ళు స్నానము చేయాలి. sports లో గాని, యింకొక దానిలోగాని, అన్నింటిలో పాల్గొనాలి. ప్రతి విషయమునందు attend కావాలి. మనము ఉన్నస్థానాన్ని మనము పరిశుద్ధము చేసుకోవాలి. ఇవన్నీ భవిష్యత్తునకు ప్రధానమైనవి. అప్పుడే awareness is life. అన్నీ తెలుసుకోటమే మన జీవితము. ఏదో ఒక subjectలోనే పోవటము యింకో subject విమర్శించటము, యిది narrow mind అయిపోతుంది. అన్నింటియందు కొంత పరిచయము చేసుకోవాలి. అంతేకాకుండా అందరువ్యక్తులతో మంచిగా జీవించాలి. ఏవిధముగా ఒకరితో ఒకరికి భేధాభిప్రాయములు వచ్చినాకూడను మనము పోట్లాడుటకు యేమాత్రము పూనుకోకూడదు. ఈ విధమైన సహన భావమును మనము పెంచుకోవాలి.

**ఆత్మ విశ్వాసము ప్రతి మానవునికి అత్యవసరము**

విద్యార్థులారా! కేవలము చెప్పటమేకాకుండా చేసి నిరూపించే దానిలో మనము ప్రవేశించాలి. ఇక్కడ అన్నింటికిని ఆధ్యాత్మికము చాలా ఆధారము. ఆత్మవిశ్వాసము ప్రతి మానవునికి అత్యవసరము. అది లేక దేనిలో కూడను మన జీవితము రాణింపచేసుకోలేము. ఈ విధమైన విశ్వాసము మనము బలపరచుకోవాలి. ముఖ్యముగా MBA Boys. నేను పూర్వము చెప్పినట్లుగా సత్సంపత్తిని మీరు అభివృద్ధి పరచుకోవాలి. ఇంద్రియనిగ్రహము, చెడ్డను చూడకుండా, చెడ్డను వినకుండా, చెడ్డను మాట్లాడకుండా, చెడ్డను తలవకుండా, చెడ్డను చేయకుండా చూచుకోవాలి. నీ నాలుకను నీవు చాలా భద్రములో పెట్టుకోవాలి. లేకపోతే చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. దీనిని MBA Boys గుర్తించాలి. ఏదో 'నేను

srisathyasaivachanamrutam

మేనేజరుగా పోతాను, నేను ఒక Aircondition room లో కూర్చుంటాను, లేబర్‌ను అంతా కంట్రోలు చేస్తాను' అనుకోవచ్చు. ఎట్లా కంట్రోల్ చేస్తావు? నీ ఇంద్రియములనే నీవు కంట్రోలు చేయలేనివాడవు లేబర్‌ను ఎలా కంట్రోల్ చేయగలవు? మొట్టమొదట నిన్ను నీవు కంట్రోలు పెట్టుకున్ననాడే యింకొకరిని కంట్రోలు చేయటానికి అధికారివి అవుతావు. కనుక మన జీవితములో భవిష్యత్తును యీనాడు లక్ష్యములో పెట్టుకోవాలి. దీనికి పారమార్థికము అత్యవసరము. దైవవిశ్వాసము చాలా అవసరము. ఈ మూడింటియొక్క తత్త్వమును మనము గుర్తించాలి.

## ఈనాటి విద్యార్థులే రేపటి పౌరులు

దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి యివే మనము పోషించుకోవాలి. ఈ మూడు ఉండినప్పుడే సరైన ఆదర్శమును నిరూపించగలవు. విద్యార్థులారా! అధిక ప్రసంగములలో మనము ప్రవేశించకూడదు. ఈనాడు మాటలలో మనము గొప్పగా ప్రదర్శించుకుంటున్నాము గాని క్రియలలో యేమాత్రము నిరూపించటంలేదు. నాకు కావలసినది మాటలు లేని హృదయము. ఈనాడు హృదయములేని మాటలు మనకు అక్కరలేదు. ఎక్కడకు వెళ్ళినప్పటికి చెడ్డనే చూడటానికి ప్రయత్నిస్తున్నాము. కాదు కాదు, మంచిని చూడటానికి ప్రయత్నించాలి. మంచి ఫలపుష్పములతో సుగంధమును వెదజల్లే నందనవనములో ప్రవేశించికూడను శునకము మలముకోసము తిరుగుతూ ఉంటుందట! కానీ ఫలాన్ని ఆశించదు. యీ పవిత్రమైన ప్రదేశములోకి వచ్చి చెడ్డనే ఎందుకు వెదకటానికి ప్రయత్నించాలి? మంచిని నీవు వెతకనక్కరలేదు. యిక్కడ కావలసినంత లభిస్తుంది. కనుక మంచిని మీరు పొందండి. ఇక్కడకు వచ్చినందుకు మీ తల్లిదండ్రులకు తగిన ఆనందమును అందించండి. అదే కృతజ్ఞత. 'మాతృదేవోభవ, పితృదేవోభవ'. యీ రెండింటి తరువాతనే గురుదేవోభవ. మన గురువునకు తగిన కృతజ్ఞతను యివ్వాలి. కానీ చాలామంది పిల్లలు గురువుకు తగిన respect యివ్వటములేదు. అది చాలా తప్పు. ఒక్కటి మాత్రము మీరు చక్కగా గుర్తించాలి. ఈనాటి పౌరులు, యీనాటి అధికారులు, వీరందరు ఎవరు? పూర్వము వారందరు మీబోటి విద్యార్థులే! ఈనాటి విద్యార్థులే రేపటి

sri sathyasai vachanamrutam

దినము పౌరులు, అధికారులు కాబోతారు. కనుక యీనాడు పౌరులకు, అధికారులకు ఏవిధమైన respect మనము అందిస్తామో రేపటి దినము అలాంటి respect ను అందుకోటానికి సిద్ధముగా ఉంటాము. ఈనాడు పెద్దలకు యేవిధమైన respect నీవు యివ్వకపోతే నీకు యితరులు యేవిధముగా అందిస్తారు. విద్యార్థులారా! యిది కేవలము one way traffic కాదు give and take యిచ్చిపుచ్చుకునే తత్త్వము. ఈ విధమైన పవిత్రమైన నడతలు మీరు అలవరచుకోవాలి. చదువుకంటే మనగుణములు చాలా గొప్పవి. చదువురాకపోయినా తప్పులేదు. గుణములు మాత్రము చదువుకోసం విసర్జించరాదు. గుణము ఉంటుంటే లోకములో యెక్కడైనా స్థానము ఉంటుంది. అయితే రెండూ ఉండటంవల్ల మరింత అభివృద్ధి గావించవచ్చు. కనుక మన విద్యాసంస్థలోపల పవిత్రమైన మానవతావిలువలు మనము అభివృద్ధి పరచుకోవాలి. మానవత్వము పోషించుకోటానికి యీ సమయములోపల అన్ని రంగములలో మనము ప్రవేశించి, పదిమందితో కలసిమెలసి ప్రేమ తత్త్వాన్ని, సహనతత్త్వాన్ని, సానుభూతిని పెంచుకోటానికి పూనుకోవాలి

**(తేదీ. 23-06-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam